# హులా హులి

- ఎమ్మెస్వీ గంగరాజు



ప్రమోషన్‌మీద భువనేశ్వర్‌కు ట్రాన్స్‌ఫర్ అవడం, ప్రమోషన్ వచ్చిన సంతోషాన్ని కాస్త మింగేసిందనే చెప్పాలి. కొత్త ప్రదేశం, తెలియని భాష, కొత్త బాధ్యతలు... ఎలా నెట్టుకురాగలనోననే దిగులు పీడిస్తూనే ఉంది. అయితే ఆఫీసులో సగంమంది తెలుగువాళ్ళే ఉండడం, మిగిలిన ఒరియావాళ్ళు కూడా సరదాగా కలసిమెలసి మసలడం చూసాక నాలోని దిగులు పూర్తిగా పోయింది.

అద్దె ఇల్లు కుదిరేదాకా ఒక బాచిలర్ ఆఫీసర్ ఇంట్లో చేరాను. చివరకు యూనిట్ ఫోర్‌లో అన్ని సదుపాయాలూ వున్న ఇల్లొకటి దొరికింది. రెండురోజుల్లో హైదరాబాద్ బయలుదేరి మా ఆవిడ్నీ, పిల్లాడిని తెచ్చుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నాను. ఆ రోజు సెలవురోజు. పనిమనిషి చేత ఉదయం ఇల్లు కడిగిస్తుండగా పాణిగ్రాహి వచ్చాడు. వాళ్లింట్లో ఏదో పూజ జరుగుతోందని, ఆరోజు లంచ్‌కి రమ్మని పిలిచాడు. అతడికి ఢిల్లీ బదిలీ అవుతుందనే గాలివార్త ఆ ముందురోజే వచ్చింది. కొంత అప్సెట్ అయ్యాడు ఆ వార్త విని. ఇద్దరం కలసి అతని స్కూటర్ మీదనే అతనింటికి బయలుదేరాం. ఇల్లు చేరగానే అతని కొడుకులిద్దరూ నమస్కారం పెడుతూ ఎదురయ్యారు. అరగంటలో పూజ పూర్తవుతుందనీ, అందాకా పిల్లలతో మాట్లాడుతూ ఉండమని చెప్పి అతను లోపలకెళ్లాడు. పిల్లలు చెప్తే తెలిసింది ఆరోజు సావిత్రి అమావాస్య పూజట. ఆ రోజు ఆడవాళ్ళు సతీసావిత్రికి ముందు పూజ చేసి తరువాత భర్తల పాదాలకు పూజ చేస్తారుట.

పిల్లలతో మాట్లాడుతూండగా లోపల గదిలోంచి "ఉళు...ఉళు... ఉళు..." అని విచిత్రమైన కేకలు వినిపించాయి. ఆ కేకలు వినబడగానే నా పక్కనే కూర్చున్న పిల్లలిద్దరూ లోపలకు పరుగెత్తారు. మళ్లీ మళ్ళీ అవే కేకలు వినిపించాయి. ఆ గదిలో నేను ఒంటరిగా మిగిలిపోయాను. ఆ కేకలు వినిపించేసరికి నాలో ఆందోళన మొదలైంది. అప్పుడు సడెన్‌గా గుర్తొచ్చాయి ఆ ఉదయం పాణిగ్రాహి అన్న మాటలు-

"ఢిల్లీ ట్రాన్స్‌ఫర్‌వలన నాకేమీ పెద్దగా ఇబ్బందిలేదుగానీ మా అమ్మాయితోనే ప్రాబ్లమ్!" సందేహంలేదు. అవి పిచ్చిపట్టిన పిల్లవేసే కేకలే. అమావాస్యకీ, పౌర్ణమికీ పిచ్చివాళ్ళకి పిచ్చి ఎక్కువ అవుతుందంటారు. ఆ రోజు అమావాస్య కాబట్టి పిల్లకి పిచ్చి ఎక్కువైనట్టుంది. రూంలో చెయిన్‌తో కట్టి ఉంచినట్టున్నారు. 'ఉళు...ఉళు...ఉళు...' కేకలు వినిపిస్తూనే వున్నాయి.

'పాపం పాణిగ్రాహి' అనుకున్నాను. కొంతసేపటికి కేకలు వినిపించడం మానేసాయి. ఆ పరిస్థితిలో అతనికి గెస్ట్‌గా వచ్చినందుకు కాస్త ఇబ్బంది కలిగింది.

తరువాత అతను వచ్చి డైనింగ్ హాల్లోకి తీసుకుని వెళ్లాడు నన్ను. హాలుకి ఆనుకుని చిన్న గదొకటి వుంది. దానికి తాళం వేసి వుంది. బహుశా ఆ గదిలోనే పిచ్చిపిల్లని ఉంచి ఉంటారనుకుని ఆ గదినీ, పాణిగ్రాహిని ఒకసారి జాలిగా చూసాను. దంపతులిద్దరూ ఆప్యాయంగా కొసరి కొసరి అన్ని పదార్థాలు వడ్డించారు. మా ఆవిడ వచ్చాక తప్పకుండా రండని ఆవిడతో చెప్పి ఇంటికి బయలుదేరాను భోజనాలు అవగానే.

హైదరాబాద్ హెడ్డాఫీసులో తన ట్రాన్స్‌ఫర్ విషయం కనుక్కోమన్నాడు పాణిగ్రాహి. కనుక్కోవడం కాదు ఆర్డరు కాన్సిల్ చేయించడానికి ప్రయత్నం కూడా చేస్తానన్నాను పిచ్చిపిల్లతో అతను పడుతున్న ఇబ్బందులు తలచుకుంటూ.

★★★

వారంరోజుల్లో మా ఆవిడ్ని తీసుకొచ్చేసాను. కొద్దిరోజులలోనే అక్కడి వాతావరణానికి తను అలవాటుపడిపోయింది. పాణిగ్రాహి ఢిల్లీ ఆర్డరు కేన్సిలైంది. అయినా అతని ఇంటికి వెళ్లడానికి సాహసించలేకపోయేవాణ్ని.

ఒకరోజు పుణెలో వున్న అన్నయ్య దగ్గర నుండి ఫోన్ వచ్చింది. తను పుణెలో ఎ.ఎఫ్.ఎం.సీలో సైకియాట్రీ ప్రొఫెసర్. కటక్ మెడికల్ కాలేజీ పీజీ ప్రాక్టికల్స్‌కి ఎక్స్‌టర్నల్‌గా వస్తున్నట్లు చెప్పాడు. పాణిగ్రాహి ఇంట్లో పిచ్చిపిల్ల వెంటనే గుర్తొచ్చింది. విషయం అంతా చెప్పి రెండు రోజులు అదనంగా సెలవు పెట్టి రమ్మన్నాను. ఆ పిచ్చిపిల్లని పరీక్ష చేసి నయం చేయగలడేమోనని నా తహతహ!

అన్నయ్య వచ్చాక ఆ మర్నాడుదయం కటక్ బయలుదేరాం. మెడికల్ కాలేజీకి వెళ్ళేముందు ఆ కాలేజీలో సైకియాట్రీ ప్రొఫెసర్ డాక్టర్ కర్ ఇంటికి వెళ్లాం. కర్ దంపతులిద్దరూ డాక్టర్లే. అతని భార్య మాత్రం కనిపించలేదు అంతవరకూ. అన్నయ్యా, అతడు పరీక్ష విషయాలు మాట్లాడుకుంటున్నారు. నేను బల్లమీదున్న మాగజైన్లు తిరగేస్తూ కూర్చున్నాను.

ఇంతలో నాకు గగుర్పాటు కలిగించే కేకలు ఒక్కసారిగా లోపలనుండి వినిపించాయి. అవే ధ్వనులు. 'ఉళు... ఉళు.. ఉళు' మంటూ ఊళలు. సందేహంలేదు. అవి పిచ్చివాళ్ళు చేసే వికృతమైన కేకలు. మళ్లీ మళ్ళీ వినిపించడంతో డాక్టర్ కర్ వైపు తిరిగి "డాక్టర్‌గారూ! ఆ శబ్దాలు ఏమిటి?" అని కాస్త సౌమ్యంగానే అడిగాను.

"మార్గశిర గురువారం కదా. మా ఆవిడ పూజ చేసుకుంటోంది" అన్నాడతను మామూలుగా. నేను నిర్ఘాంతపోయను.

'ఏ మంత్రపుష్పమో చదువుకోవాలిగానీ ఈ ఊళలేమిటి?' అని మనసులో అనుకుని "పూజకీ ఆ శబ్దాలకీ సంబంధమేమిటి?" అని అడిగాను.

"ఆ శబ్దాలని 'హులా హులి' అంటాం మేం. ఏ వ్రతం జరిగినా, శుభకార్యం జరుపుకున్నా మా ఆడవాళ్ళు 'హులా హులి'లు వేస్తారు. చిన్నగా నోరు తెరిచి నాలుకను ఇటూ అటూ ఆడిస్తే ఆ శబ్దాలొస్తాయి. మనం వెయ్యలేం. వాళ్ళే వేస్తారు" అంటున్న డాక్టర్ కర్‌ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ ఉండిపోయాను.

★★★

కొన్నాళ్ళ తరువాత ఆఫీస్‌లో ఏదో సందర్భంలో ట్రాన్స్‌ఫర్ల టాపిక్ వస్తే "నాకు ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయితే మా పాప చదువు మధ్యలో ఆగిపోతుందేమోనని తెగ బాధపడిపోయాననుకోండి" అని పాణిగ్రాహి అన్నాడు.

భువనేశ్వర్‌లో పని చేస్తున్న రోజులు గుర్తుకొచ్చినప్పుడల్లా 'హులా హులి'లు గుర్తు చేసుకుంటూంటాను. వారి పూజా విధానాన్ని పిచ్చికేకలనుకోడం... మన ఊహలు ఒక్కోసారి ఎంత తప్పుగా ఉంటాయో గ్రహించడానికి చక్కని తార్కాణం.

★